క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం



బోడిపుట్టులో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సుబ్బలక్ష్మి

ముంచంగిపుట్టు: గిరిజన యువత ప్రతిభను సానపెడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ బోడిపుట్టు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలను గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పోటీలను ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి సుబ్బలక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, గిరిజన యువత క్రీడల్లో ప్రతిభను కనబర్చి మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. కామేష్, నాగార్జున్, దామోదరం, రామకృష్ణ, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు

గూడెంకొత్తవీధి: సంక్రాంతి పండగ నేపథ్యంలో సోమవారం దామనాపల్లిలో గిరిజన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాంట్రాక్టరు గోవిందు, వార్డు సభ్యులు సోములమ్మ, రాజేశ్వరి, గ్రామపెద్దలు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న స్థానికులు

చింతూరు: మండలంలోని ఏజీకొడేరులో సోమవారం ప్రమాదవశాత్తు ధర్మల సత్తిబాబుకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమవడంతో స్థానికులు వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో సుమారు రూ.30వేల నగదు, 10 బస్తాల ధాన్యంతో పాటు ఇంట్లోని సామగ్రి కాలిపోయినట్టు బాధితుడు తెలిపాడు.

ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నాయకుడు శ్రీనివాసరావు

రంపచోడవరం/దేవీపట్నం: దేవీపట్నం: ఏజెన్సీలోని ప్రతిభ ఉన్న క్రీడాకారులకు తగిన విధంగా ప్రోత్సాహిస్తామని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. రంపచోడవరం మండలంలో కాకవాడలో తున్నూరు యూత్ ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో, దేవీపట్నం మండలంలోని పెద్ద భీంపల్లి గ్రామాల్లో జరిగిన క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎస్‌ఐ షరీఫ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్క కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. టోర్నీల్లో విన్నర్, రన్నర్స్ జట్లకు నగదు బహుమతి అందజేశారు. అయ్యప్ప, బాపన్నదొర, రాంబాబు, ప్రసాద్, డాక్టర్ జగన్నాధశర్మ, కళ్యాణ్, అయ్యప్ప, బాపన్నదొర పాల్గొన్నారు.

నేడు నారమ్మ పేరంటాల తీర్థం

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని మంగళవారం నారమ్మ పేరంటాలు తీర్థం జరపనున్నట్టు తీర్థ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. నారమ్మ పేరంటాలు గుండం వద్ద భక్తులను పూజలను చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాల ప్రదర్శనను నిర్వహించనున్నట్టు తెలిపారు. విజేతలకు నగదు పురస్కారాన్ని బహుమతిగా అందించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.



రాజవొమ్మంగిలో ముగ్గులు వేస్తున్న మహిళలు



జి.కె.వీధిలో భోగి మంట వేస్తున్న స్థానికులు



భోగిమంట వద్ద గ్రామస్తులు



పెదగార్లపాడులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

గ్రామాల్లో భోగి పండుగ సందడి



జి.మాడుగులలో భోగి మంట వద్ద ఓ కుటుంబం



రాజవొమ్మంగిలో భోగి మంట వద్ద స్థానికులు



రంపచోడవరంలోని సాయిబాబా ఆలయం వద్ద భోగి మంటలు

జి.మాడుగుల: మన్యానికి సంక్రాంతి పండగ శోభ సంతరించుకుంది. ఇళ్లను మామిడితోరణాలు, పూలతో అలంకరించారు. ముంగిట గొబ్బెమ్మలతో రంగు రంగుల ముగ్గులతో దర్శనమిస్తున్నాయి. కొత్త అల్లుళ్ల రాక..బంధుమిత్రులతో ఇళ్లన్నీ సందడిగా మారాయి. వీధులన్నీ కళకళలాడుతున్నాయి. పెద్ద పండగ సంక్రాంతి వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా భోగి పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చెడుని కాల్చి వేసే నిప్పు కణికలు మంచి, మానవత్వానికి పట్టం కట్టేదే భోగి పండుగని చెప్పవచ్చు. హిందూ సంప్రదాయం ప్రకారం భోగి పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే అన్ని వయస్సుల గల వారు నిద్రలేచి కట్టెలు, పేడ పిడకలతో భోగి మంటలు వేసి దాని చుట్టూ చేరి చలికి వెచ్చదనం పొందారు. అనంతరం భోగి మంట వద్ద కాచిన నీటితో పుణ్యస్నానాలు చేశారు. శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన రేగిపండ్లు(భోగి పండ్లు), పూలు, చిల్లర నాణెలు, కలిపి తల్లిదండ్రులు, పెద్దవారు తదితరులు చిన్నారుల తలపై పోసి, దీవించారు. ఇలా చేయటం వలన పిల్లల ఆయుష్షు పెరుగుతుందని, సూర్యుని ఆశీస్సులు ఉంటాయని సర్వశుభాలు కలుగుతాయని నమ్మకం. పెద్దలు, చిన్నారుల భోగి ఉత్సవం జరుపుకొని భోగి శుభాకాంక్షలు ఒకరినొకరు తెలియజేసుకొని ఉత్సాహంగా జరుపుకున్నారు.

ముంచంగిపుట్టు : మండలంలో గిరిజన గ్రామాల్లో యువత భోగి మంటలను వెలిగించి సందడి చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి యువత భోగి మంటకు కలపను సిద్ధం చేశారు. భోగి మంటల్లో పిడకలను వేసి బూడిదను బొట్టుగా పెట్టుకుని దేవుని పూజించారు. మహిళలు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి పూలతో అలంకరించారు. చిన్న పిల్లలకు భోగితో పెద్దలతో భోగిపండ్లు పోయించి దీవెనలను అందించారు.

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ, అరకు, గుంటసీమ, డుంబ్రిగుడలలో ఆదివారం రాత్రి భోగిమంటను వేసి సోమవారం ఉదయం ఆ భోగి మంటలో చలికాస్తు గిరిజనులు ఉపశమనం పొందారు. భోగిమంటలో నీరు వేడి చేసి ఆ నీటితో పుణ్యస్నానాలు ఆచారించారు. భోగభాగ్యాలు, ధనం, పంటలు బాగా పండాలని గ్రామ పెద్దలు కుటుంబాలను ఆశీర్వదించారు. మంగళవారం జరిగే సంక్రాంతి వేడుకకు థింసా నృత్యాలు, ఇతర్రతా సాంస్కృతిక కార్యక్రమాలకు గిరిజనులు ఏర్పాట్లు చేసుకున్నారు.

గూడెంకొత్తవీధి: తెలుగువారి లోగిళ్లన్నీ సోమవారం భోగిమంటలతో సందడిగా మారాయి. మండలంలోని పలుచోట్ల వేకువజామునే భోగి మంటలు వేశారు.

గంగవరం: మండలంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. పాత గంగవరం, పెద్దగార్లపాడు, ఓజుబంద, నెల్లిపూడి, కొత్తాడ, తదితర గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పెదగార్లపాడులో మడకం రమాదేవి, సింగారమ్మ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని మూడు రోజుల పాటు పలు సాంస్కృతి నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. మడకం చిన్నప్పుదొర , రవీంద్ర , బాపనమ్మ, ఉదయశ్రీ మంగమ్మ , సాయి తదితరులు పాల్గొన్నారు.

గంగవరంలో నేడు ముగ్గుల పోటీలు

గంగవరంలో మధ్య వీధి సినిమాహాల్ వీధి ఐక్య కోయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఐక్య కోయ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ రాంబాబు దొర తెలిపారు.

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా ఇంటింటా భోగి పండుగను స్థానికులు వైభవంగా జరుపుకొన్నారు. స్థానిక శ్రీకోదండరామస్వామి, గ్రామదేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయం, శ్రీకృష్ణుని ఆలయాల వద్ద యువకులు పెద్ద పెద్ద భోగి మంటలు వేశారు. పిల్లలు, పెద్దలు వేకువ జాము నుంచే ఈ భోగి మంటల వద్ద చేరి సందడి చేశారు. ఇంటింట భోగి పండగను సంస్కృతి సాంప్రదాయాలు పాటిస్తు జరుపుకొన్నారు. పుణ్యస్నానాలు అనంతరం సూర్యునికి భక్తిపూర్వకంగా నమస్కరించారు. అనంతరం భోగి మంట వద్ద పూజలు చేసి ఆవుపిడకలు, ఆవు పాలు పెరుగు అగ్నిదేవుని సమర్పించి పసుపుకుంకుమలు. పండ్లు పూలతో పూజలు చేశారు. భోగి సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంట మహిళలు రంగురంగుల రంవల్లులు అద్దారు.

చింతపల్లి;చింతపల్లి మండలంలో సంక్రాంతి పండుగ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.తొలి రోజు భోగి పండుగ సందర్భంగా అన్ని గ్రామాల్లో యువకులు గ్రామస్తులు కలసి గ్రామాల మధ్యలో భోగి మంటలను వెలిగించి థింసా నృత్యాలతో సందడి చేశారు.

తెల్లవారుజాము నుంచి పిల్లలు పెద్దలు భోగి మంటలు వద్ద చలికి ఉపశమనం పొందుతూ స్నానమాచరించి నూతన వస్త్రాలు ధరించి తొలి రోజు భోగి పండుగను ఆనందంగా గడిపారు.



డుంబ్రిగుడలో భోగిమంట వేసిన గ్రామస్తులు



చింతపల్లిలో భోగి మంట వద్ద ఓ కుటుంబం

ముఖ్యంగా చింతపల్లి, చౌడుపల్లి, తాజంగి, లోతుగెడ్డ తదితర ప్రాంతాల్లో సంక్రాంతి వేడుకలను మరింత జోష్‌గా నిర్వహిస్తున్నారు. పలు సాంస్కృతికి కార్యక్రమాలు నిర్వాహణకు ఏర్పాట్లు చేశారు.

మన్యంలో మంచు ముసురు

ముంచంగిపుట్టు:మండలంలో విపరీతంగా కురుస్తున్న మంచుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.మంచులో రాకపోకలు చేసే వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది.ప్రతి రోజు ఉదయం 9గంటల వరకు మంచుతో గిరిజన గ్రామాలు కప్పబడి ఉండడంతో వాహనదారులు హెడ్ లైట్ వెసుకొని రాకపోకలు సాగిస్తున్నారు.

కొంత మంది వాహనదారులు మంచు వల్ల ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. రహదారులలో మలుపు మంచుతో కనిపించని పరిస్థితి ఏర్పడడంతో నిత్య భయం భయంగా రాకపోకలు చేయాల్సిన వస్తుంది. దీనికి తోడు గిరిజన గ్రామాల్లో చలి తీవ్రత సైతం గిరిజనులను గజగజ వణికిస్తుంది.

రాజవొమ్మంగి: విపరీతంగా కురుస్తున్న మంచు మరోవైపు వణికిస్తున్న చలితో రాజవొమ్మంగి పరిసరాల్లోని ప్రజలు గత రెండు రోజులుగా నానా ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 10 గంటలైనా మంచు తెరలు వీడడం లేదు. చల్లగాలులకు పిల్లలు, వృద్ధులు అల్లాడుతున్నారు. పిల్లలు రొంప దగ్గుతో అస్వస్థతకు గురవుతుండగా వారికి సపర్యలు చేయడంలో తల్లిదండ్రులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ముంచంగిపుట్టులో మంచుతో హెడ్‌తో వస్తున్న వాహనం

తుమ్మలబందలో ముగ్గుల పోటీలు

కొయ్యూరు: భోగి సందర్భంగా మంప పంచాయతీ తుమ్మలబందలో సోమవారం మాజీ ఎంపీటీసీ బి.శివరామరాజు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు రాజ భూపాల్, అప్పలకొండ, సత్తిబాబు, శేఖర్, అప్పలకొండ, రాంబాబు కల్యాణ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ఇచ్చారు.



ముగ్గుల పోటీలో పాల్గొన్న గ్రామస్తులు

కనులపండువగా గోదా రంగనాథుల కల్యాణం



మేడిచర్లలో గోదాదేవి, రంగనాథస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రోలుగుంట: గత నెలలో ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు సోమవారం భోగి రోజుతో ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్తవ మూర్తుల (గోదాదేవి, విష్ణుమూర్తి) చిత్రపటాలను వాహనంపై మండలంలో గల 28 రోజుల పాటు ఊరేగించారు. రోలుగుంటకు చెందిన సిద్ది వినాయక జీవకారుణ్య సంఘం సభ్యులు సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమ ఆచారాలను పాటిస్తూ ప్రతి రోజూ వేకువజామున గ్రామ వీధుల్లో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తూ విష్ణుమూర్తికి ఇష్టమైన భక్తి కీర్తనలు విలపిస్తూ గ్రామాల్లో ఆధ్యాత్మికతను నింపారు. ముగింపు రోజు సోమవారం గోదాదేవి రంగనాథుని కళ్యాణం ఘనంగా నిర్వహించారు.

కె.కోటపాడు : మేడిచర్ల గ్రామంలో గల భూగోదాదేవి సమేత కేశవ స్వామి ఆలయంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. భోగి పండగను పురస్కరించుకొని ప్రతి ఏటా గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు తాత వెంకట రమణమూర్తి తెలిపారు.

మాడుగుల : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక పురాతన పార్థసారథి స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. మాడుగులతో పాటు చుటుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి కల్యాణం తిలకించారు. ఈ సందర్భంగా స్వామివారిని, గోదాదేవిని పుష్పాలు, నగలతో ప్రత్యేకంగా అలంకరించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జెన్‌కో అధికారులు

మోతుగూడెం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పొల్లూరు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గోవిందరావు పేరున నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు పలు గ్రామాల నుంచి క్రికెట్ జట్లు పాల్గొన్నాయి.

నాలుగు రోజుల పాటు టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ వేంకటేశ్వర స్వామి తిరువీధోత్సవం



పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామిని సోమవారం భోగి పండగ సందర్భంగా గ్రామంలో తిరువీధోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారికి కళావేదిక ప్రతిష్టింపజేశారు. ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. నెల రోజుల పాటు భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు, ప్రసాద వితరణ జరిపారు. రాత్రికి గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా పూర్తి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేటి రామకొండల రావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అరకు ఎమ్మెల్యేకు స్వల్ప అస్వస్థత

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సోమవారం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గత కొంతకాలంగా స్వల్ప అస్వస్థతకు గురైన అరకు ఎమ్మెల్యేకు సోమవారం ఆస్పత్రిలో వైద్యులు పరీక్షలు జరిపారు. ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించినట్టు తెలిసింది.



ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

చింతూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడిచేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు చింతూరు ఎస్‌ఐ రమేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా బెల్టుషాపుల్లో విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

వైభవంగా స్వయంభూ విఘ్నేశ్వరుని తీర్థం

కె.కోటపాడు : మల్లంపాలెం స్వయంభూ విఘ్నేశ్వరుని తీర్థ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా జరిపారు. ప్రతీ ఏటా స్వయంభూ విఘ్నేశ్వరుని తీర్థం భోగి పండగనాడు జరపడం ఆనవాయితీ.

ఈ సందర్భంగా స్వయంభూ విఘ్నేశ్వరుని ఆలయంలో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు. తీర్థం సందర్భంగా స్వయంభూ విఘ్నేశ్వరుడిని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, వార్డు సభ్యులు వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు, మాజీ ఉప సర్పంచ్ బొడ్డు లక్ష్మి దేముడుబాబు, జాగరపు కన్నంనాయుడు, పెదగాడి సత్యనారాయణ, బొడ్డు అప్పారావు, తోటపు చిరంజీవి దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.



స్వయంభూ విఘ్నేశ్వరునికి పూజలను చేస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, తదితరులు

వైభవంగా రుద్రహోమం

మాకవరపాలెం: వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఈ ఆలయంలో ఉన్న స్వయం భూ లింగానికి అర్చకులు అన్నంతో అభిషేకం చేశారు.

అనంతరం రుద్ర హోమం, లక్ష్మీగణపతి హోమం, మృచ్యుంజయ హోమంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ముగిసిన మేలుకొలుపులు

కోటవురట్ల/మునగపాక: గత నెల 17న ధనుర్మాసంలో ప్రారంభమైన మేలుకొలుపుల కార్యక్రమం భోగి పండుగతో ముగిసింది. ఇందులో భాగంగా కోటవురట్ల మండలం పాములవాకలో మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గణపతి, సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా ఉత్సవ విగ్రహాలతో నగర సంకీర్తన చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు కోలాటం ఆడుతూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చిడతల డ్యాన్సు, డప్పు వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మునగపాక పల్లపు వీధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో పరమేశ్వరుని చిత్ర పటాన్ని డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. వాడ్రాపల్లి, గవర్ల అనకాపల్లి, చూచుకొండ, గణపర్తి తదితర గ్రామాల్లో భక్తులు మేలుకొలుపుల కార్యక్రమంలో పాల్గొన్నారు.



మునగపాకలో పరమేశ్వరుని చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

తారువలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు రేపు

దేవరాపల్లి : తారువలో మర్లమాంబ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు స్థానిక యూత్ సభ్యులు తెలిపారు. ఈ పోటీలలో విజేతలకు రూ.15వేలు, రూ.10 వేలు, రూ.7వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్టు వారు తెలిపారు. బుధవారం ఉదయం గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలలో పాల్గొనే వారు మంగళవారం సాయంత్రం 6 గంటల లోపు నామినేషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం భారీ అన్నసమారాధనను నిర్వహించారు. అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాయంత్రం మహిళ కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.